# రాధలేఖ ★ రచయిత: శ్రీ "రాధ"

రంగురంగుల గౌనులతో, సింగారించుకొని, కిలకిలా నవ్వుచూ, కేరింతలు కొట్టుకొంటూ, చిలుకల్లాగా ఒక్క పర్యాయం వచ్చివాలేవారు ఆడపిల్లలు. వాళ్ళురాగానే మా విద్యాలయానికి, ఒక రకమైన నూతన శోభ, నిండుదనము వచ్చేది. ఆలస్యంగా రావడంచేత, అంతా విధేయతతో నిలబడేవారు. నేను క్రొత్తవాణ్ణి కావడంచేత క్రొత్త క్రొత్త ఉపాధ్యాయుల వలె, తమాషాగా గాంభీర్యాన్ని అభినయిస్తూ ఉండేవాణ్ణి. నన్ను చూచేసరికి నవ్వులు దవ్వులై వినయము, భయము గోచరించేవి వాళ్ళముఖములలో. అప్పుడు నేను కొంచెం పరుషస్వరంలో ఆలశ్యానికి కారణం చెప్పమంటూ అందరినీ ప్రశ్నించేవాణ్ణి.

"తలదువ్వించుకొని జడవేసుకొని, పూలు గుచ్చుకుంటున్నానండి" అని సరోజిని,

"క్రొత్త గౌను తొడగమంటే తొడగ లేదండి" అని లక్ష్మి.

"పాచిచిమ్మి, అంట్లుతోమ మంది మాయమ్మ" అని హైమవతి,

"మాయమ్మ వాకిటుందండి" అని రాధమొదలైన పిల్లలు ఈ విధంగా భయకంపిత స్వరంలో చెప్పేవారు.

ఆడపిల్లలు చెప్పే ఆ సమాధానాలువిని ఉబికివచ్చే నవ్వు ఆపుకున్నా, చెదరివచ్చిన చిరునవ్వుతో, "సరే! కూర్చోండి" అని చెప్పి పాఠాలు ప్రారంభించే వాణ్ణి. అమ్మయ్య! దెబ్బలు తప్పించుకున్నాము గదా! అని ముసిముసి నవ్వులు నవ్వుకునే వారు ఒకరిముఖం ఒకరు చూచుకుంటూ......

* * *

ఉపాధ్యాయులకు పిల్లలమీద, పిల్లలకు ఉపాధ్యాయుల మీద పరస్పరము గాఢమైన ప్రేమ ఉండాలి. ఉపాధ్యాయునకు పిల్లలపై ప్రేమలేకపోతే పిల్లలు వికాసాన్ని పొందలేరు. ఉపాధ్యాయుడూ ప్రతిష్ఠ పొందలేడు. పిల్లలకు ఉపాధ్యాయునిపై ప్రేమలేకపోతే అతడెంత చెప్పినా కంఠశోషే అవుతుంది. ఎలాంటి మంచివిషయాలు చెప్పినా లక్ష్యపెట్టరు. తన్మూలంగా వాళ్ళేంతో నష్టపడతారు— అందువలన విద్యకు మూల సూత్రం ప్రేమ. "దండం దశ గుణం భవేత్" అని కొందరు "మర్ధనం గుణవర్ధనమ్" అనిమతి కొందఱు చెప్పి దండోపాయాన్ని ప్రయోగించేస్తారు. కాని ప్రేమలేకపోతే వీనిని లక్ష్య పెట్టరు సరిగదా మొద్దుబారి పోతారు. ఉపాధ్యాయుని ప్రవర్తన, బోధనా విధానమే పిల్లలను మంచి మార్గములో పెట్టుటకు సాధనములగును. దానికై ముందుగా పిల్లల స్వభావాలను ఉపాధ్యాయులు అవగాహన చేసుకోవాలి. అప్పుడే విద్య వికసిస్తుంది. ఉభయులు ఉన్నతిని పొందిరాణిస్తారు. అని నేను ఈమార్గాన్నే అవలంబించాను. దీని ఫలితంగా శెలవువస్తే నాకు వాళ్ళకీ కూడ ఏమీ తోచేది కాదు. చెప్పాలని నాకూ, వినాలని వాళ్ళకు మిక్కిలి ఉబలాటంగా ఉండేది......

* * *

ఇలావుండగా కొంతకాలానికి పరీక్షలు వచ్చినవి. మరి కొన్నిరోజులకు ఫలితాలు కూడా తెలిసినవి. చదువురాని మొద్దులు అనుకునే, కమల, బాపమ్మ, సరస్వతి పాసయ్యేసరికి అంతా నివ్వెర పోయారు. రాధ, లక్ష్మి మొదలయిన వాళ్ళు ఫస్టున పాసయ్యారు. పిల్లల తల్లి దండ్రులు, ఏమీ సంబంధములేకుండా మరికొందరు గ్రామస్థులు, నన్ను అభినందించి వెళ్లుతూఉండేవారు. వెనుకటి పంతుళ్ళు ఇలా చెప్పలేదని, లేకుంటే మా పిల్లలు ఇంకాచాలా పైకిపోయేవారని, నాకు పూర్వమునఉన్న ఉపాధ్యాయులను కొంతమంది విమర్శించేవారు. ఇంకా ముఖప్రీతి కెన్నెన్నో చెప్పేవారు. నా కృషి బాగా ఫలించిందని మేరలేని సంతోషం పొందేవాణ్ణి. ఇప్పుడు మా ప్రేమ చిలువలూ పలవలై పెరిగి పోయింది. పూర్వంకన్నా మా విద్యాలయం వృద్ధిచెంది ముందడుగు వేస్తూవుంది......

* * *

ప్రకృతి తనవిశేష పరిణామాన్ని తు, చ, తప్పకుండా ఆచరణలో పెట్టుతూఉంటుంది. అది దాని నైజ గుణము. గౌనులస్థానాన్ని, లంగాలు వోణీలు ఆక్రమించినవి. యౌవనము తొలకరించింది. సిగ్గు విశేషంగా తొంగిచూస్తోంది. దోహద క్రియలుపొందిన తీగల్లాగ సాగివచ్చారు ఆడపిల్లలు. విద్యనుచూచి ఓర్వలేక యౌవనం పోటీపడింది. విద్యకంటే

ముందుగ యౌవనం తనగమ్యస్థానం చేరుకొని విజయాన్ని ప్రకటించింది. విజయగర్వంతో విద్యనుచూచి వెటకారంగా నవ్వింది యౌవనం. సృష్టిలో భేదంలేక పోయినా దృష్టిలో భేదంవచ్చింది. లోకంలో స్వార్థం పెచ్చు పెరిగి కన్న తలిదండ్రులే తమ సంతానంలో పక్షపాతం వహించారు. సంఘం తాళం వేస్తోంది వారికితోడుగా. ఆడపిల్లలకు యౌవ్వనం తొలకరించడం అంటే విద్యాసమాప్తికి నాంది అన్నమాట. ఇదే సమయంలో తలవని తలంపుగా నేను మరొకచోటికి బదిలీ కావలసి వచ్చింది. వాళ్ళతోను వాళ్ళ తల్లి దండ్రులతోను విద్యను పూర్తిచేయండని మధ్యలో మాన్పవద్దని, ఊరడింపుగా ఎన్నో చెప్పాను. విచారంతో అంతా సన్మానం చేసి "వీడ్కోలు" ఇచ్చారు. అతి కష్టంమీద క్రొత్త చోటికి చేరుకున్నాను. ఇచ్చటకు వచ్చినప్పటినుండి పదేపదే వాళ్ళు తలంపుకు వచ్చేవారు. కాని క్రొత్త పిల్లల పరిచయం పూర్వస్మృతిని మరపించేది......

*　　*　　*

ఈ క్రొత్త ప్రదేశానికి నేనువచ్చి రెండు నెలలైంది. ఈ మధ్య వాళ్ళసంగతి తెలియక చంద్ర చకోర న్యాయంగా, రోజూ లేఖకు ఎదురు చూస్తున్నా. ఒక రోజు క్లాసులో ఉండగా బంట్రోతు ఉత్తరం ఇచ్చిపోయాడు—

పూజ్యులైన గురువుగార్కి, హృదయ పూర్వక ప్రేమాంజలులు...

ప్రేమతో వ్రాసిన మీలేఖ చేరింది. మీరు వెళ్ళిన పిదప, మాకు సంఘటించిన పరిస్థితులనుబట్టి మనస్సు బాగుండక ప్రత్యుత్తరం వ్రాయుట ఆలస్యమైనందుకు క్షమించండి! "విద్యలేకపోతే జీవితం అంధకార బంధురము" అని మీరు వ్రాశారు. కాని విద్యవిలువను గుర్తించలేక "మెతుకు పోతే బ్రతుకు పోతుంది" అని భావించే మా పెద్దల సంగతి ఏమి వ్రాయమంటారు? "తాచెడ్డకోతి, వనమెల్ల చెఱచినట్లు" వాళ్ళుచదువుకోకపోగా, మమ్మల్నికూడా చదివించకుండా డబ్బుకులోబడి, అజ్ఞాన లోయల్లోకి తీసుకొని వెళ్తున్నారు. మా తప్పల్లా పెద్దవాళ్ళము కావడమే. లోకం ఆక్షేపిస్తుందని సంఘం ముక్కుమీద వ్రేలుపెడుతుందని, ఇరుగు పొరుగువారు, గిట్టనివారు కాస్తకుగంపలు కల్పిస్తారని ఏవేవో హితోపదేశాలు చేస్తున్నారు. "సాధకమున పనులు సమకూరు ధరలోన" ఈ మీ సందేశాన్ని చదివాను, విచారించాను. కాని ఇది కూడా ఫలించేటట్లు కనపడలేదు. ఇలాంటి అభిప్రాయాలున్న మా వాళ్ళను ఎలా ఒప్పించగలము? ఒప్పించే యోగ్యత కూడా మా వద్దలేదు. అంతా చదువుకు స్వస్తి చెప్పాం! పెండ్లి చేయటానికి మీన మేషాలు లెక్కగడుతున్నారు. అంతా వాళ్ళిష్టమేగా! భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కాని అది భారతనారికి సంబంధం లేనట్లు స్పష్టమవుతోంది. దేశభక్తులు పత్రికలలో స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ స్వాతంత్ర్యం, అని పెద్ద అలజడి చేస్తారు కాని క్రియ సున్న. స్వాతంత్రం లేనిజీవనం నిరాశకు గురికావలసి వస్తుంది. ఇంతకంటే వేరే శరణ్యం లేదు!

★


ప్రఖ్యాతిగాంచిన ప్రశస్తమైన

మెహతావారి విశేష ఔషధములు

1. సుందరి ఎలిగ్జిర్ :—సమస్త ఋతుదోషములను పోగొట్టును, గర్భాశయరోగ అనుపమ నివారిణి.
2. ఫాస్ఫరస్ ఆయిల్ :—బాధ నివారణకు సాటిలేని తైలము.
3. మస్తానాపిల్సు :—సాధారణ బలహీనత, కీళ్లనొప్పులు, జ్వరములన్నిటికి అమోఘముగా పనిచేయును.
4. ద్రాక్షాసవము :—(బంగారము, మకరధ్వజము కలిసినది) రక్తమును శుద్ధిపరచునటువంటి, అజీర్ణము రూపుమాపునటువంటి బలవర్ధకౌషధము.

కెమిస్టులందరివద్ద దొరకును.

తయారు చేయువారు :— **K. S. MEHTA & CO.**
*250, China Bazar, Madras.*